# పంపకాలు

## — పొలుయుగు వెంకటేశ్వరరావు

మూడు దినాల్నుండి ఒకటే ముసురు! తెల్లగా తెరగట్టిన ఆకాశం చినుకు తర్వాత చినుకును రాలుస్తున్నది. దానికి తోడు చలి వణకటి మొదలయి, ఎముకల్ని కొరుక్కుని తినటం మొదలు పెట్టింది అందువలన అవసరమయిన పని వుంటే గానీ, ఎవరూ ఇంట్లో నుండి అడుగు దీసి బయట పెట్టలేక పోతున్నారు.

ఇంటి నిండా మనుషులున్నారు 'ఇంట్లో నెయ్యి నిండుకుంది' అని భార్య చెప్పగా, గొడుగు వేసుకుని వెళ్ళి ఆ వర్షంలోనే- నెయ్యి తీసుకు వచ్చాడు నారాయణ. క్యారియరు భార్యకి అందించి- గాబుదగ్గరకి వెళ్ళి, కాలు చేతులు కడుక్కుంటూ వుండగా- గాబులో నీరు అడుగంటుతున్నట్లు అనిపించింది. చినుకుల్లో నానుతూనే, నూతి దగ్గరికి వెళ్ళి నీళ్ళు చేది గాబునింపాడు నారాయణ. అలవాటు ప్రకారం చిన్నా పెద్దా పనులు పూర్తి చేసుకొని, అంగవస్త్రంతో మొహం తుడుచుకుంటూ ఇంట్లోకి వెళ్ళేసరికి హాల్లో చర్చలు వాడిగా వేడిగా జరుగుతూ వున్నాయి! నారాయణని చూసినాక ఆ వేడి కొంత తగ్గింది

'రావయ్యా, రా. సమయానికి వచ్చావు'. అంటూ ఆనందయ్య ఆహ్వానించాడు ఆనందయ్య నారాయణకి బావ మరిది అవుతాడు. ఆ తర్వాత నారాయణ చిన్న కొడుకు చంద్రరావుకి పిల్లనిచ్చిన మామ కూడా అవటంతో, ఆ ఇంటితో అతని బాంధవ్యం మరింత బలపడింది

నారాయణకి నల్గురు కొడుకులూ- ఇద్దరు కూతుళ్ళూ ప్రస్తుతం కొడుకులు నల్గురూ వుద్యోగాలు చేసుకుంటూ వేరు వేరు వూళ్ళల్లో వుంటున్నారు ఇద్దరు కూతుళ్ళూ భర్తలతో అన్యోన్యంగా సంసారాలు చేసుకుంటూ పిల్లా పాపలతో చల్లగా హాయిగా వుంటున్నారు కనపడుతున్న దాన్ని బట్టి ఎవరికి ఏ లోటూ లేదు.

వున్న లోటల్లా నారాయణ భార్య నాగమ్మకే! పెళ్ళయిన మూడు నాలుగేళ్ళ పాటు పిల్లలు కలగక పోయేసరికి, బెంబేలు పడిపోయి, పిల్లలో పిల్లలో అని అల్లాడి ఎందరో దేవుళ్ళకి మ్రొక్కి, వ్రతాలు ఆచరించి, వుపవాసాలు చేసింది ఆ పూజలు ఫలించాయా అన్నట్లు, పిల్లలూ, వాళ్ళతో పాటు రోగాలూ, రొష్టులూ, వాటితో పాటు ఎన్నో సమస్యలూ వరుసగా పుట్టుకురాగానే- ఆ పిల్లల్తో, సమస్యల్తో సతమతమయి నానా హైరానా పడి, వాళ్ళతో డిదే తన లోకమని భ్రమించి- వాళ్ళు ఏడిస్తే తనూ ఏడ్చి, వాళ్ళు నవ్వితే తనూ నవ్వి, వాళ్ళ సమస్యలన్నీ తన సమస్యలుగానే భ్రమించి- కళ్ళల్లో పెట్టుకుని వాళ్ళని పెంచి పెద్ద జేసి- తను నాటిన మొలకలు చివుళ్ళువేసి సాగి, వృక్షాలయి ఎత్తుకు ఎదగ్గా, కని, ఆనందంతో వుబ్బి తబ్బిబ్బయ్యింది. తన జీవితాశయం నెరవేరినందుకు ఆనంద బాష్పాలు రాల్చి, చీర చెరగుతో కన్నులు వత్తుకుంది పిల్లలు అందరూ పచ్చ పచ్చగా వున్నారు. ఎవరికీ ఏలోటూ లేదు అదే పదివేలు. అయితే -నలుగురు పిల్లలూ కళ్ళ ఎదుటే కాపురాలు చేసుకుంటూ వుంటే చూసి ఆనందించాలన్న ఆశ నాగమ్మకి ఏనాటి నుంచో వుండటం వలన -అది నెరవేరనందున -ఆ బాధా, ఆ లోటూ, అలాగే నిల్చి పోయేయి

పిల్లలందరూ ప్రయోజకులు. తల్లిదండ్రులంటే ఈ నాటికీ గౌరవ ప్రపత్తులను నిలుపుకొని వున్నవారు తమని కని, పెంచి, ఇంత వాళ్ళని చేసినందుకు ఆ అభిమానాన్ని ఈ నాటికీ నిల్పుకుని- నలుగురూ కూడ బలుక్కుని- ప్రతి సంవత్సరం, ఒక పండగకయినా దూరదూర ప్రాంతాల నుండి, భార్యా బిడ్డలతో సహా వచ్చి, ఆ నాలుగు రోజులూ సర్దాగా గడిపి- తల్లిదండ్రులకి తృప్తి *లిగించాలన్న కనీసపు ధర్మాన్ని ఎరిగి వున్నవారూ, వ్యవహార దక్షులున్నూ. ఆదపడుచులున్నూ అంతే

పిల్లల్ని, ఆ పిల్లలు గన్న పిల్లల్ని తల్చుకుంటూ- వాళ్ళని చూడాలన్న ఒక ఆరాటం గుండెల్లో ఎగిరి తన్నగా, బాధకు లోనవుతూ- తను వర్రి అవుతూ, ఆ వర్రిని భర్త నారాయణ కూడా తనతో పాటు పాలు పంచుకొనటం లేదని, అతన్ని సాధిస్తూ- కాలం గడిపే నాగమ్మ- ఆ పిల్లలు కళకళలాడుతూ నట్టింట్లో నడిచిన ఆ నాల్గు రోజులూ సంతోషంతో వుబ్బి తబ్బిబ్బయి వుక్కిరి బిక్కిరవుతుంది

ఒక్కసారిగా నిశ్శబ్దం అలుముకుని- మనుషులు సీరియస్‌గా మారి పోవటం తనకే చిత్రంగా అన్పించి-

'ఏమిటి విశేషం?' అంటూ చనువుగా వెళ్ళి ఆనందయ్య ప్రక్కన బల్లమీద కూర్చున్నాడు నారాయణ

'అదేమిటి? నీకు చంద్రరావు చెప్పలేదా?' అని, చంద్రరావు వంక చూసి, చంద్రరావు తల వంచుకొనగా, పరిస్థితి అర్థంకాగా, చిర్నవ్వు నవ్వి నలుగుర్ని కలయ జూసాడు ఆనందయ్య, వ్యవహర్త మాదిరిగా

'ఇంతకీ విషయ మేమిటంటే- ఇపుడు తక్షణం చంద్రరావుకి పెద్ద మొత్తంలో డబ్బు కావలసి వచ్చింది! ఆ సంగతి అతను నాతో చర్చించాడు నీతోనూ మాట్లాడతానని అన్నాడు నేనూ దాని గురించే- మేనల్లుళ్ళతోనూ, మేన గోడళ్ళతోనూ వివరంగా, వ్యవహార పరంగా మాట్లాడాను. అందరం కలిసి బాగా ఆలోచించి, ఒక ఏకాభిప్రాయానికి వచ్చాము ' ఆనందయ్య

ఇటీవల ఢిల్లీలో జరిగిన జాతీయ ఇంద్రజాలికుల మహాసభలలో ఇంద్రజాల ప్రదర్శన ఇచ్చి ప్రశంసలు అందుకున్న హైదరాబాద్ మెజీషియన్ చొక్కాపు వెంకటరమణ




అగాడు

'బాగానే వుంది మరేమిటి సంశయమూ?' అని నారాయణ కొడుకుల మొహాల్ని పరకాయించి చూసేడు ఏ ఒక్క మొహంలోనూ నెత్తురు చుక్క లేదు. మొహాలు వంచుకుని వున్నారు

ఆనందయ్య సకిలించి– నిదానంగా అన్నాడు– 'సంశయం ఏమి లేదుగాని పెద్దవాడివి. నీతో ఒక్క మాట చెప్పి సరేనన్పించుకుంటే గాని అది శంకులో పోసిన తీర్థం గాదుగదా! అది దప్ప మిగతా వ్యవహారమంతా సెటిలయినట్టే!

'బావా ఇంతకీ నీవు ముసుగును పూర్తిగా తీయనే లేదు?!'

'ఏముంది? వడ్లగింజలో బియ్యపు గింజ అంతే ఆ జవాహిరి మొత్తం అప్పుడే– తల్లి దగ్గర నుంచి




తీసేసుకుని , ఆడకూతుళ్ళిద్దరూ పంచుకోవటం ఇందాకే అయిపోయింది. ఇక మిగిలిన స్థిరాస్తులు అనగా ఈ వూళ్ళో వున్న స్థలాలూ, ఇళ్ళూ, గ్రామంలో వున్న పొలాలూ దొడ్లూ, ఇళ్ళూ అన్నిట్నీ న్యాయంగా సమంగా నీ కొడుకులే పంపకాలు చేసుకున్నారు. వాట్ని అమ్మేసి క్యాష చేసుకునే వుద్దేశ్యంతో– అప్పుడే పార్టీలని కూడా చూసుకున్నారు రాత కోతలకి గాను కరణం గార్కి కభురు వెళ్ళింది. కాకపోతే ఇందులో– నేను లేవనెత్తిన ఒక పాయింటుని ఫైనలయిజు చెయ్యాలి

'ఏమిటది?' అన్నాడు నిర్లిప్తంగా నారాయణ పిల్లల్ని చూసుకున్న పొంగులో – నాగమ్మ నడుం ఎరగ్గట్టుకుని, పొయ్యి దగ్గర సెగలో వుక్కిపోతూ, వేడివేడిగా వుల్లిపాయ పకోడీలు వేయగా వాట్ని ప్లేటుల్లో సుతారంగా సర్ది పట్టుకు వచ్చారు నారాయణ కోడళ్ళూ కూతుళ్ళూ –ఎగబడి వాట్ని అందుకోబోయిన పిల్లల్ని గదిమి, వాట్ని వ్యవహారంలో మునిగి వున్న పెద్దలకి సరఫరా చేసారు. అటువంటి ఒక ప్లేటుని అందుకుని, ఒక వుల్లిపాయ పకోడిని, నోట్లోకి నేర్పుగా విసరి, దాన్ని పళ్ళ సందున ఇరికించి, కొరుకుతూ –

–'నాకు నచ్చులేదు. ఈ పద్ధతి నాకు అసలు నచ్చులేదు' అన్నాడు ఆనందయ్య, పిసుకులాటగా అలవాటు ప్రకారం

'ఏమిటో చెప్పక ఈ ముసుగులో గుద్దులాట ఎందుకయ్యా?'

'వస్తున్నా, వస్తున్నా, కొంచం ఆ గుర్రాన్ని కట్టియ్యి జన్మ అన్నది ఒకటి ఇచ్చిన కారణాన, పున్నాల్లో పెట్టి, కళ్ళల్లో పెట్టుకుని తలిదండ్రుల్ని చూసుకోనాలి, కన్నవాళ్ళ ఋణం జన్మలో తీర్చుకొనలేనిదే అయినా, వాళ్ళని సేవించి తరించటం అన్నటువంటి సత్కార్య నిర్వహణలో, స్వార్థమిళితమయిన ఆనందం అనేది ఒకటి వున్నదీ అన్న గ్రహింపు వున్న రత్నమాణిక్యాలే నీ బిడ్డలందరూ వాళ్ళు మిమ్మల్ని ఎంత నెత్తి మీద పెట్టుకుని సేవలు జేస్తామన్నా, ఎన్ని విధాలుగా చెప్పినా కూడా – మా అక్కా నీవూ కూడా, ఈవూరొదిలి పెట్టి వెళ్ళి, వాళ్ళ దగ్గర వుండనే వుండలేరూ – అనే నేను గట్టిగా అంటున్నాను కాదని వాళ్ళ మాటా ఏది ఏమయినా ఈ రోజులు ఆ రోజులు గాదూ. ఈ మనుషులు ఆ మనుషులు కాదూ ఈ పద్ధతులు ఆ పద్ధతులూ కావూ ఎవరి దారిన వారు వుంటేనే అభిమానాలూ, ఆప్యాయతలూ నిలిచేది! ఎక్కడ వుండవలసిన వాళ్ళు అక్కడ వుండటమే అందరికీ సుఖం, శుభం, శ్రేయస్కరమున్నూ –'

'కాదని ఋజువు ఏ మనిషంటాడయ్యా?' నారాయణ చిరాగ్గా అన్నాడు.

ఆనందయ్య గలగల నవ్వాడు

'అదుగో! చూసావా! చూసావా! నువ్వు సూక్ష్మంలో తేల్చేసావు నేనూ అదే అనుకున్నానులే. అందువలన – మైడియర్ ఎంగ్ ఫెలోస్! నా వాటా నా వాటా అంటూ ఎవరి వాటా వాళ్ళు పంచుకుపోవటం గాదు మీతో పాటు, తల్లిదండ్రులకి కూడా ఒక వాటా పంచి ఇచ్చి మిగతాది కావాలనుకుంటే ఎవరిది వారు అమ్ముకుని పొండి అది పద్ధతిగానూ వుంటుంది ధర్మంగానూ వుంటుంది– అని నేను అంటున్నానయ్యా. బావా! నువ్వేమంటావు మరి?'

ఆ మాటలకి నారాయణ ఖండితంగానే చెప్పాడు 'ఏమీ వద్దులే మాకేం అవసరం లేదు ఎవరికి అవసరం వున్నదో వాళ్ళనే వాటాలు వేసుకుని పట్టుకు పొమ్మను దానికి ఇంత రభస అనవసరం '

(ESTD : 1974)

స్వద్విద్యావ్యాప్తికి; ఆధ్యాత్మిక - నైతిక విద్యా ప్రచారానికి పేరుబడసిన

వి వే కా నం ద గు రు కు ల ము ను

ని ర్వ హిం చే

నందిమండల ఎడ్యుకేషనల్ సొసైటీవారు

తమ విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, పోషకవర్గమునకు మరియు వారి బంధు మిత్రులకు

దీపావళి శుభాకాంక్షలను

తెలియజేయుచున్నారు.

వివేకానంద గురుకులము కల్పించే విద్యాసౌకర్యములు :

1. రికగ్నైజ్డ్ హైస్కూలులో 1 నుంచి 10 తరగతులు - తెలుగు మీడియం.
2. C. B. S. E. ఎలిమెంటరీ స్కూల్ ఇంగ్లీషు మీడియం.
3. జూనియర్ కాలేజి 1 st and 2 nd ఇంటర్‌మీడియట్ తరగతులు - తెలుగు మీడియం.

ఇట్లు

ఏరువ వెంకటరెడ్డి B.A; B.T;

(వ్యవస్థాపకులు మరియు సెక్రటరీ)


నందిమండల ఎడ్యుకేషనల్ సొసైటీ

మహానంది (కర్నూలు జిల్లా)

# పంపకాలు

ఆ తర్వాత – ఎవరికి వారు లేచి వారి వారి వ్యాపకాల్లో మునిగి పోగా – ఆనందయ్యా లేచి తన ఇంటికి సాగిపోయాడు. తర్వాత కొన్ని దినాల్లోనే పక్షులన్నీ గూళ్ళు వెతుక్కుంటూ తలో దారి పట్టగా – అందరి కంటే ఆఖరిగా తిరుగు ప్రయాణంలో రైలెక్కిన వాడు చంద్రరావు అతన్ని సాగనంపి, తిరుగు ముఖం పట్టాక ఇంటి దారిలో –'నిజంగా, బావా! 'నేను నిండు గుండెతో చెప్తున్నాను కొడుకులతో పాటు, వాటా పంచుకొన నిరాకరించి, నీవు తప్పు చేసావు!' – అన్నాడు ఆనందయ్య. విచారంగానే. నారాయణ నవ్వాడు.

'పిచ్చివాడా! ఈ వాటా నాకు అవసరం లేదయ్యా. ఎందుకో తెలుసా? మా అమ్మా బాబుల్నించి నేను పంచుకుని తెచ్చుకున్న ఆ ఆస్తిపాస్తుల్లో నా బిడ్డలు వాటా కోరలేదు – పుచ్చుకొనలేకపోయారు.



అందుకే వాళ్ళకి ఈ వాటాలు కావలసి వచ్చాయి ' అన్నాడు నారాయణ.

'బావా' నీ మాటలు నాకర్థం కావటం లేదు! పిల్లలకి తెలియనీయకుండా కొంత దాచి వుంచావన్నమాట! బావా! కన్నబిడ్డల్నే ఇలాగ మోసగించటంవి తండ్రికి తగదయ్యా! అన్యాయం' –అని ఆనందయ్య నెత్తీనోరూ మొత్తుకొనగా –తన అల్లుడికి అన్యాయం జరిగిందని నిష్కరించగా–

నారాయణా నిట్టూర్చాడు. చాలా నిముషాలు బరువుగానే దొరలిపోయిం తర్వాత –"ఆనందయ్యా! నేను నిల్పుకున్న ఆ 'ఆస్తి' దాచుకొనేది కాదయ్యా! ఏ దొంగలూ దోచుకొనగలిగేది కాదు! నా పిల్లలకి ఆత్మవిశ్వాసం – అన్న నా పిత్రార్జితాన్ని నేను పంచి ఇవ్వలేకపోయాను. అదే నా విచారం – అది నా చేతుల్లోనూ లేదు.' అన్న నారాయణ వంక అప్పుడు తెల్లబోయి చూసి తర్వాత లజ్జపడి తల వంచుకున్నాడు ఆనందయ్య. □